నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గురువారం
30 మే 2024
పేజీలు 8
ప్రకాశం
బాపట్ల

రాజకీయాల్లో అతనొక మార్క్.. మన అనుకున్న వాళ్లను తన ప్రాంత ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకుంటారు.. అధికారం ఉందని ఎన్నో ఇబ్బందులకు గురిచేసి.. మానసికంగా ఇబ్బంది పడేలా పరిస్థితిని సృషించినా అతను లొంగలేదు.. తమ అధికార పైశాచికత్వాన్ని మరింత పెంచి ఆర్థికంగా దెబ్బతీసేందుకు కుట్రలు పన్నారు. వేల మంది కార్మికుల పొట్టకొట్టయినా ఆయన్ను తమ దారిలోకి తెచ్చుకోవాలని ఎన్ని జిత్తులు పన్నినా ఏదీ జరగలేదు. మానసికంగా ఇబ్బందులు పెట్టినా, ఆర్థిక సమస్యలు సృష్టించినా అధికార పార్టీ కుయుక్తులు ఆయన నిబద్ధత ముందు పటాపంచలైపోయాయి.. విపక్షంలో ఉన్నా ప్రజల కోసం, రైతుల కోసం నిరంతరం వారికి అండగా ఉంటూ తన రాజకీయ చాణిక్యతను కొనసాగిస్తూ ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీలో చెరగని ముద్ర వేసుకొని అయిదోసారి అద్దంకి గడ్డపై తన పసుపు జెండాను ఎగరవేయనున్నారు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్...



# అద్దంకి గడ్డ.. గొట్టిపాటి అడ్డా

- అయిదోసారి విజయకేతనం వైపు ఎమ్మెల్యే రవికుమార్ పయనం
- రెండున్నర దశాబ్దాల నుంచి ప్రజానేతగా గొట్టిపాటి
- అధికార పార్టీ కుట్రలను ఛేదించిన నాయకుడు
- రాష్ట్రంలోఎక్కడా లేని విధంగా ఆర్థికంగా దెబ్బతీసేలా వైకాపా కుయుక్తులు
- నమ్ముకున్న వారి కోసం మానసిక, ఆర్థిక సమస్యలన్నింటిని అధిగమించిన వైనం
- ఎన్ఎస్‌పి రైతుల కోసం నిరంతరం పోరాటం
- వైకాపా ప్రజావ్యతిరేక చర్యలపై అనునిత్యం ఉద్యమం
- గొట్టిపాటి నాయకత్వమంటే ప్రజలకు ఓ నమ్మకం
- మరోసారి అద్దంకిని గొట్టిపాటి కైవసం చేసుకుంటారంటున్న ప్రజానీకం

సూర్యప్రతినిధి, ఒంగోలు



అధికార పార్టీ వేధింపులు, కుట్రలను ఛేదించుకొని ప్రజా క్షేత్రంలో ప్రజల మద్దతుతో ముందుకు వెళుతున్న నేతగా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ నిలుస్తున్నారు. వైకాపా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎమ్మెల్యే గొట్టిపాటి లక్ష్యంగా అనేక రాజకీయ కుతంత్రాలు జరిగాయి. ఇందులో భాగంగా గొట్టిపాటి తెలుగుదేశం పార్టీని వీడి వైకాపాకు మద్దతు ఇవ్వాలని గత నాలుగేళ్లుగా వైకాపా చేసిన దాష్టీకాలు ఒకటి రెండు కావు కానీ గొట్టిపాటి ఎక్కడా రాజీపడలేదు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా నమ్ముకున్న ప్రజల కోసం వాటిని శాంతంగానే ఎదుర్కొన్నారు. అయినప్పటికీ కాలం గడుస్తుండటంతో గొట్టిపాటిపై అధికార వైకాపా ప్రభుత్వం కొత్త కోణాల్లో ఒత్తిళ్లకు గురిచేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా మానసికంగా వేధింపులకు తెర లేపింది. వాటిని

మిగతా 3లో





# కౌంటింగ్ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

- బయట వ్యక్తులు కౌంటింగ్ వద్దకు రాకుండా అడ్డుకోవాలి
- సీసీ కెమెరాల నిఘాను పెంచాలి
- వైకాపా నేతల వ్యాఖ్యలను ఈసి సీరియస్‌గా పరిగణించాలి
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా వైకాపా నేతల ప్రచారం
- ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విజ్ఞప్తి

సూర్యప్రతినిధి, ఒంగోలు



కౌంటింగ్ కేంద్రాల వద్ద బయట ప్రాంత వ్యక్తులు రాకుండా అడ్డుకోవడంతో పాటు పటిష్టమైన భద్రత సిసి కెమెరాల నిఘా పెంచాలని కొండేపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. కౌంటింగ్‌కి మరో నాలుగు రోజులు సమయం ఉండగా వైసిపి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు, సజ్జల రామకృష్ణారెడ్డి సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న వైనాన్ని ఎన్నికల అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఈసీ నిర్ణయాధికారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని కౌంటింగ్‌లో తిరగబడి కొట్లాడే ఏజెంట్‌లుగా నియమించాలని వైకాపా నేతలు తమ అభ్యర్థులకు సూచించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం అన్నారు. రైస్ కాలేజ్ వద్ద జరిగే కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తుతో పాటు గట్టి భద్రతా చర్యలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైకాపా నేతల వ్యాఖ్యలపై నిఘా పెంచి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఘర్షణ వాతావరణం లేకుండా సజావుగా కౌంటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈసీ, రేంజ్ ఐజిని ఎమ్మెల్యే స్వామి కోరారు.

# కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలి

- పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు జరగాలి
- రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- రైజ్‌లో ఓట్ల లెక్కింపు ముందస్తు ఏర్పాట్లు పరిశీలన

ఒంగోలు, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 4న రైజ్ ఇంజనీ రింగ్ కళాశాలలో చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు ఈనెల 30 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.ఎస్. దినేష్‌కుమార్, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలు రిటర్నింగ్ అధికారులు, సహా రిటర్నింగ్ అధికారులతో సమావేశమై



మిగతా 3లో

# నిప్పుల కొలిమి

- ప్రకాశం జిల్లాలో భానుడి భగభగలు
- 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఒంగోలు, పశ్చిమలో దంచికొడుతున్న ఎండలు
- తీవ్ర ఎండ, వడగాలులు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనం
- వచ్చే మూడు రోజులు ఇంకా ఎండలు పెరిగే అవకాశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: రోహిణి కార్తె రావడంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా నిప్పులు కొలిమిలా మారింది. భానుడు భగభగ మండుతున్నాడు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుంది. ఇప్పటికే జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటాయి. వచ్చే మూడు రోజులు ఇంకా ఎండ తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. తీవ్ర ఎండతో పాటు వడగాలులు వీస్తున్నాయి. దానికి తోడు ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు ఎండతో పాటు వేడిగాలులు వీస్తున్నాయి. బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా

మిగతా 3లో

# జీడి మామిడి పరిశోధన స్థానం వారి రైతు సదస్సు





బాపట్ల, మేజర్‌న్యూస్: డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం జీడిమామిడి పరిశోధనా స్థానం బాపట్లలో గ్రామీణ ఉద్యాన పని అనుభవ కార్యక్రమం రూరల్ హార్టికల్చరల్ వర్క్ ఎక్స్పీరియన్స్ చేస్తున్న విద్యార్థులు బేతపూడి గ్రామంలో రైతు సదస్సు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వైయస్సార్ ఉద్యాన కళాశాల చినలాటరిపి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్ ఎస్ పద్మ పాల్గొని మిరప వంగ మల్లె వివిధ పంటలలో రైతులు చేపట్టవలసిన మెలుకువులు పాటించవలసిన ముఖ్యమైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. బాపట్ల జీడి మామిడి పరిశోధన స్థానం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె ఉమామహేశ్వరరావు పూల తోట సమస్యలు వాటి పరిష్కార మార్గాలను రైతులకు తెలియజేశారు. తెగుళ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె జ్యోతిర్మయి మాధవి వివిధ పంటల్లో తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. కీటక శాస్త్రవేత్త డాక్టర్ జి స్రవంతి వివిధ పంటలను ఆశించు చీడపీడలు వాటి సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్ విద్యార్థులు వారి అనుభవాలను పంచుకున్నారు. రైతులు అడిగినా ప్రతి ప్రశ్నకు శాస్త్రవేత్తలు సమాధానాలు అందించారు. రైతులకు పరీక్షించిన మట్టి నమూనా పత్రాలను ముఖ్యఅతిథి ద్వారా అందించడం జరిగింది. ఈ రైతు సదస్సులో భాగంగా ఆర్ హెచ్ డబ్ల్యు ఈ పి విద్యార్థులు ప్రదర్శనగా మిద్దె తోట, రాక్ గార్డెన్, వర్టికల్ గార్డెన్, పట్టుపురుగుల పెంపకం, వాటి ఉత్పత్తి, బయోగ్యాస్ ఉత్పత్తి, సమీకృత వ్యవసాయ పద్ధతులు, టెర్రరియం, మీస్ట్ చాంబర్, ఎండు పూలతో తయారుచేసిన ఫ్రేమ్స్, హైవే ల్యాండ్ స్కేపింగ్, హైడ్రోఫోనిక్స్, టోపియారిస్, అంతర పంటల సాగు, డ్రోన్ టెక్నాలజీ, సముద్రపు నాచు సాగు, లేజర్ ల్యాండ్ లెవలింగ్ వంటి ఆకర్షణీయమైన నమూనాలను తయారుచేసి రైతులకు వివరించారు. ఈ ప్రదర్శనలో వివిధ ఉద్యాన ఉత్పత్తులు ద్రాక్ష జామ్, మర్మలాడ్, టమోటా వడియాలు, కొబ్బరి లడ్డు, గోరింటాకు, మెంతుపొడి, రసం పౌడర్, ఉసిరి పొడి, టమోటా కెచప్, సుగంధ షరబత్, ఆమ్ చూర్, బీట్రూట్ పౌడర్, టూటీ ఫ్రూటీ, మందారం పొడి వంటి అనేక ఉత్పత్తుల ద్వారా రైతులకు వివిధ సాంకేతిక అంశాల గురించి వివరించారు. అగ్రి అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ కే రమణారెడ్డి, కావూరి వారి పాలెం బేతపూడి, వేదులపల్లి విహెచ్ఎ లు, 80 మంది రైతు సోదరులు ఉత్సాహంగా పాల్గొని సదస్సును విజయవంతం చేశారని తెలిపారు.

## బొజ్జా వారి వివాహ వేడుకలో తాండ్ర



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లి లోని కళ్యాణమండపంలో జరిగిన మాజీ సైనికుడు బొజ్జా తిమోత (తిరుపతయ్య) జ్ఞానమ్మ ల కుమారుడు ప్రమోద్ బాబు, బ్యూలా గ్రేస్ ల వివాహ వేడుకలలో పాల్గొని వదూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు డి వెంకటేశ్వర్లు, ఎమినేని సురేంద్ర, సిహెచ్ వి కృష్ణా రావు, రుక్మదర రావు మొదలగు మాజీ సైనికులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజన పథకం పోషకాహారం పై ఒక్కరోజు శిక్షణ



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండల పరిధి లోని వివిధ ప్రభుత్వ పాఠశాల నందు వంట నిర్వహిస్తున్న వంట వారికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం ఉదయం గం 9:45 నుండి సాయంత్రం గం 5 ల వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా తాజ్ హోటల్ వారు వంటలపై చేసిన పిపిటి ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లు గా పడవల కిషోర్, ఉలవలపూడి సురేష్ వ్యవహరించారు.స్థానిక మండల స్థాయి పర్యవేక్షకులుగా ఎంఈఓ-2 నీలం దేవరాజు వ్యవహరించారు.మధ్యాహ్న సమయంలో ఉన్నత పర్యవేక్షకులుగా డిప్యూటీ డిఈఓ జి వెంకటేశ్వరరావు, ఏమ్ ఓ పి.శ్రీనివాస్ వ్యవహరించడంజరిగింది.ఈ కార్యక్రమానికి మండల స్థాయిలో 40 మంది వంటవారు మరియు విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామికి పుష్పయాగం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం శ్రీ సత్యసాయి బాబా మందిరంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జరుగుతున్న మండల దీక్ష కార్యక్రమం 37 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రతిరోజు 11 సార్లు హనుమాన్ చాలీషా పారాయణంను చేస్తున్నారు. హనుమాన్ చాలీషా పారాయణంతో పాటు ఆంజనేయస్వామి కి భక్తిశ్రద్ధలతో పుష్పయాగం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదంను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు తునుగుంట్ల వెంకట సుబ్బారావు, లలిత బాబు ,పి వి రంగారావు ,సువర్చల, కొమ్మూరి మురళీకృష్ణ, తుమ్మల శ్రీనివాస రావు, కె ఓ ఎన్ ఎం ప్రసాద్ ,పి.వెంకటేశ్వర్లు ,పెనుమెత్స బాపిరాజు, చేబ్రోలు వెంకటేశ్వరరావు ,విజయలక్ష్మి ,కోడూరి చంద్ర ,బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## బాపట్ల లో ఘోర విషాదం




బాపట్ల రూరల్, మేజర్ న్యూస్: బాపట్ల మండలం బాపట్ల అద్దికట్ల రహదారి నాగరాజు కాలువలో నలుగురు యువకులు గల్లంతు. బాపట్ల పట్టణం ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యులంక సముద్రతీరానికి తెలంగాణ రాష్ట్రం నుంచి హైదరాబాద్ కూకట్ పల్లిలో నివాసం ఉంటున్న స్థానికులు పాఠశాలల సెలవులు అయిపోవస్తున్నందున 30 మంది సముద్ర స్నానాలకు బాపట్లకు వచ్చారు. స్నానాలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో ఉన్న నాగరాజు కాలువ దగ్గర ఉన్న చెట్ల కింద కాసేపు సేద తీరటానికి వాహనాలు ఆపుకున్న సమయంలో పిల్లవాడు నాగరాజు కాలువలోకి ఈతకి దిగాడు. ఆ పిల్లవాడు లోతట్టు ప్రాంతంలోకి వెళ్లి గల్లంతవటంతో వారితో వచ్చిన వారిలో ఒకరి తర్వాత ఒకరు ఐదుగురు దిగటంతో లోతట్టు ప్రాంతం అవటం వల్ల నలుగురు గల్లంతయ్యారు ఇరువురు బయటపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో రూరల్ సీఐ శ్రీహరి, పోలీస్ సిబ్బంది పడవ సహాయంతో నాగరాజు కాలువ వెంబడి గాలిస్తున్నారు. సన్నీ, సునీల్, కిరణ్,నందులు కాలవలో గల్లంతయ్యారు ఇద్దరు మృతదేహాలు వెలికి తీశారు.

## మండలంలోని ఏరులై పారుతున్న కాపు సారా అమ్మకాలు

నిజాంపట్నం, మేజర్ న్యూస్: మండలంలోని నిజాంపట్నం, దిండి, ఏమి నేని వారి పాలెం, పరిశా వారి పాలెం, కళి పాలెం, తదితర గ్రామాలలో కాపుసార అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎలక్షన్ కోడ్ అమల లో ఉన్నప్పటికీ సెబ్ అధికారులు అన్నీ తెలిసిన రాజకీయ నాయకుల వత్తులలో, మామూళ్ల మత్తులో తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు మండలంలోని బెల్ట్ షాపులు వీధికి ఒకటి చొప్పున ప్రవేశపెట్టి అమ్మకాలు జరుగుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి వీటిని అరికట్టాలని ఆయా గ్రామ ప్రజలు కోరుచున్నారు.

# జూన్ 1న శ్రీ అభయాంజనేయ స్వామి వారి జయంతోత్సవాలు



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానము వద్ద ప్రతిష్టించబడిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలు జూన్ 1వ తేదీన జరుగుతాయని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం గం 6 లకు విఘ్నేశ్వర పూజ,శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఉత్సవ మూర్తుల పాద పద్మములకు పంచామృతాలతో అభిషేకం, స్వామివారికి అలం కరణ, అనంతరం శ్రీ అభయాంజనేయ స్వామి వారికి సహస్ర నామ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.శ్రీ అభయాంజనేయ స్వామి వారి అభిషేకము మరియు ఆకు పూజ ను బుర్లె విజయ్ కుమార్-రోజా రాణి దంపతులు నిర్వహిస్తారన్నారు.ఉదయం గం 10 లకు దేవస్థాన మహిళా కమిటీ సభ్యు లచే శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. సాయంత్రం గం 6 లకు శ్రీ విఘ్నేశ్వర పూజ,మూల విరాట్ కు అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని వారు తెలిపారు.అనంతరం దేవస్థాన వాసవి కళావేదిక నందు శ్రీ సువర్చలా సమేత శ్రీ అభయాంజనేయ స్వా మి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించబ డుతుందన్నారు.కళ్యాణ పూజలో ఆత్మూరి వాలే శ్వరరావు-భవాని,మద్దుల వెంకటరమణ-పద్మజ దంపతులు పాల్గొంటారని వారు తెలిపారు.మద్దుల యజ్ఞ నారాయణ-లక్ష్మీ పద్మజలు ఉత్సవ ప్రసాద ద్రవ్య దాతలుగా వ్యవహరిస్తారని వారు పేర్కొన్నారు.అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ జయంతోత్సవాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

# అల్లా బక్షికి నివాళి

- ప్రముఖ పాత్రికేయులు అల్లా బక్షి సంతాప సభ
- రచయితగా, జర్నలిస్టుగా విశేషమైన సేవలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురి నివాళి



బాపట్ల, మేజర్‌న్యూస్: సినియర్ పాత్రికేయులు, రచయిత, నటుడు అల్లాబక్షి మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆ రంగాలకు ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా విశేషంగా రాణించారని అన్నారు. బాపట్ల లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన సంతాప సభలో పలువురు ప్రసంగించారు. ప్రముఖ జర్నలిస్టు, రచయిత అల్లాబక్షీ మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. పత్రికా, సాహిత్య రంగాలకు తీరనిలోటని విశ్రాంత హోమ్ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి అన్నారు. సీనియర్ జర్నలిస్టు బాషా అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బి ఎస్ నారాయణ భట్టు, ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షులు డాక్టర్ పిసి సాయిబాబు, హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషి బాబు, గిరిజారాణి, ప్రముఖ న్యాయవాది జమ్రుద్ బాషా, బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యాంసుందర్, ప్రముఖ రచయిత ఆర్యన్ వర్మ, ఆదం షఫీ, షేక్ జిలాని, రహీమ్ జానీ, కమల్ భాష, పలువురు పాత్రికేయులు పుర ప్రముఖులు అల్లా బక్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆనంద్ బక్షి అనే కలం పేరుతో తీరం చేరని కెరటాలు, చైర్మన్ చంద్రయ్య, సంఘర్షణ, వెలుగునీడలు, జీవన పోరాటం, కార్మికులారా ఏకంకండి వంటి అభ్యుదయ నాటికలు, నాటకాలు రచించి తెలుగు రంగస్థలానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మహమ్మద్ ఖాన్, సయ్యద్ పీర్, బండి కళ్ళ బాబురావు, దేవరకొండ రాము, పాత్రికేయులు చాన్ బాషా, మహబూబ్ సుభాని, బడుగు కృష్ణ, మేధా శ్రీనివాసరావు, వేజెండ్ల శ్రీనివాసరావు, బక్కా దీపక్, రచయితలు మస్తాన్ వలీ, తదితరులు పాల్గొన్నారు.



# అద్దంకి గడ్డ.. గొట్టిపాటి అడ్డ

**మొదటి పేజీ తరువాయి** సైతం ఎమ్మెల్యే గొట్టిపాటి అధిగమించడంతో ఆర్థికంగా దెబ్బ కొట్టి తమ దారిలో తెచ్చుకోవాలని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గొట్టిపాటి ఆర్థిక వనరులను టార్గెట్ చేసి భారీ జరిమానాలు, క్వారీలపై దాడులు వంటి వాటితో ఇబ్బందులు పెట్టింది. కానీ గొట్టిపాటి అధికార పార్టీ చేసిన ఒత్తిళ్లకు, కుట్రలకు ఎక్కడా లొంగకుండా తమను నమ్ముకొని ఉపాధి పొందుతున్న కార్మికులు, ఉద్యోగుల కోసం అన్నింటిని దిగమింగి వైకాపాకు మింగుడు పడని వ్యక్తిత్వంతో ప్రజానేతగా నిలుస్తున్నారు. గొట్టిపాటి పేరంటే అక్కడి ప్రజలకు నమ్మకం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రాజకీయాల్లో ఆరంగేట్రం చేసినప్పటి నుంచి నిబద్ధత, నమ్మకానికి మారుపేరు అయిన రాజకీయ నేతగా ప్రజల మన్ననలు పొందారు. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఐదో సారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గత రెండున్నర దశాబ్దకాలం నుంచి ప్రజలు ఆయన వెంటనే నడుస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం సమస్య ఏదైనా పరిష్కరించే సత్తాగల నాయకుడిగా రవికుమార్ గుర్తింపు పొందడమే. ఒకవైపు తెలుగుదేశం పార్టీకి అద్దంకి నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చి మరో వైపు నమ్ముకున్న ప్రజలకు మేలు చేయాలని లక్ష్యంతో గొట్టిపాటి అద్దంకిని అభివృద్ధి పథంలో నడిపారు. గత ఐదేళ్ల కాలంలో అధికారపార్టీ చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు జిల్లాలోని మిగిలిన టిడిపి ఎమ్మెల్యేలతో కలసి అనేక సమస్యలపై గళమెత్తిన నేతగా గొట్టిపాటి నిలుస్తున్నారు. వైకాపా ప్రభుత్వం ఎన్ఎస్‌పి కాలువ ద్వారా సకాలంలో నీరు వదలకపోవడం, పలు మార్లు క్రాప్ హాలిడే ప్రకటించేందుకు ఎత్తులు వేయగా గొట్టిపాటి రవికుమార్ దాని పూర్తిస్థాయిలో ఎదుర్కొని రైతులకు అండగా నిలిచారు.

**మరోసారి గొట్టిపాటికి జైకొట్టనున్న అద్దంకి**

సార్వత్రిక ఎన్నికల్లో అద్దంకి నియోజకవర్గం ఓటర్లు మరోసారి గొట్టిపాటి నాయకత్వానికి జైకొట్టేందుకు సిద్ధమైనట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా గొట్టిపాటికి ప్రజాదరణ ప్రభంజనంలా మారింది. ప్రతి ఒక్కరు గొట్టిపాటిని ఆదరిస్తున్న తీరుతో మరోసారి అద్దంకి గడ్డపై పసుపు జెండా ఎగరడం ఖాయమనే భావన ప్రజల్లో వ్యక్తమవుతుంది. ప్రజానాయకుడిగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా లెక్క చేయకుండా మానసికంగా, ఆర్థికంగా తాను ఇబ్బందులు పడి ప్రజలకు అండగా నిలిచే నాయకులు స్వల్పంగా ఉంటారని అందులో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఒకరని నియోజకవర్గం ప్రజలు అంటున్నారు.



## ఆంజనేయుడు అభయ ప్రదాత

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండలంలోని ఐలవరం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో జరుగుతున్న హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం తెనాలి శరణాగతి గోష్టి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ నరేంద్ర రామానుజ దాస స్వామీజీ పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు.ఆయన మాట్లాడుతూ ఆంజనేయుడు అభయ ప్రదాత అని కోరిన కోర్కెలు తీర్చే స్వామి అని తెలియజేశారు. భక్తులు యువకులు ఆంజనేయుని ఆదర్శంగా తీసుకోవాలని సేవా తత్వము, శారీరక దృఢత్వం, సూక్ష్మ బుద్ధి హనుమంతుని లక్షణాలని,ఆ లక్షణాలు మనలో ఉండాలన్నారు రామభక్తితో మనందరి రక్షకుడుగా భూత, ప్రేత, పిశాచ బాధలు నుండి రక్షించి మనో ధైర్యం కలిగిస్తాడన్నారు. రామనామ జపం ద్వారా హనుమాన్ చాలీసా పారాయణ ద్వారా హనుమంతుడు యొక్క అనుగ్రహం పొందవచ్చు న్నారు.అందె పవన్ కుమార్ దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాచర్ల రంగారావు ఆధ్వర్యంలో భజన సంకీర్తన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొసనం భాస్కర వెంకటరమణ, వామనపల్లి కోటేశ్వరరావు తదితర భక్తులు పాల్గొన్నారు.

## నిప్పుల కొలిమి

**మొదటి పేజీ తరువాయి** మారిపోతున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో ఎండలు దంచికొడుతున్నాయి. జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ప్రతీ వేసవికి నగర పాలక సంస్థ నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలు కూడా ఈ వేసవికి మరిచారు. దీంతో బాటసారులు త్రాగు నీటి కోసం అల్లాడిపోయే పరిస్థితులు ఎదురైయ్యాయి.

**ఎండ తీవ్రత పరిశీలిస్తే....**

ఒంగోలు - 42 డిగ్రీలు, మార్కాపురం - 43 డిగ్రీలు, కొండెపి - 41 డిగ్రీలు, దర్శి - 41 డిగ్రీలు, యర్ర గొండపాలెం - 41 డిగ్రీలు, అద్దంకి - 42 డిగ్రీలు, పర్చూరు - 42 డిగ్రీలు, చీరాల - 42 డిగ్రీలు, కందుకూరు - 44 డిగ్రీలు, సంతనూతలపాడు - 43 డిగ్రీలు, గిద్దలూరు - 40 డిగ్రీలు, కనిగిరి - 41 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

## భైరవకోన దేవస్థానం వేలంపాటల ఆదాయం రూ.20,68,000లు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో పాపుల నిర్వాహణకు బుధవారం నిర్వహించిన వేలంపాటలో కేవలం వాహన పార్కింగ్ రుసుము వసూలు, కొబ్బరికాయలు పూజా ద్రవ్యములు అమ్ముకునేందుకు, తలనీలాలు పొగుచేసుకునేందుకు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్ అమ్ముకునే హక్కులకు తగినంతమంది పాటదారులు రావడంతో నాలుగింటికి నిర్వహించి మిగతా ఆరుపాటలు తరువాత వేలంపాట నిర్వహిస్తామని ఇఓ నారాయణరెడ్డి తెలిపారు. దేవస్థానం ఆవరణలో దేవాదాయశాఖ అధికారులు ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్దరమణారెడ్డి సమక్షంలో నిర్వహించిన వేలంపాటలో వాహనా పార్కింగ్ రుసుం వసూలుకు 8,10,000 కొబ్బరికాయలు పూజా ద్రవ్యములు అమ్ముకునేందుకు రూ.9,58,000లు, కూల్ డ్రింక్స్ ఐస్ క్రీమ్ అమ్ముకునుటకు రూ.2,00,000లు, తలనీలాలు పొగుకు రూ.1,00,000లు పాడుకున్నట్లు గత సంవత్సరం నాలుగు రకాల మీద రూ.2,70,000లు అదనంగా వచ్చినట్లు ఇఓ తెలిపారు. ఈకార్యక్రమంలో ఇఓ నారాయణరెడ్డి, చైర్మన్ రమణారెడ్డి, సిఎస్‌పురం కెనరాబ్యాంకు మేనేజర్ ఈశ్వర్, బి.వి.సుబ్బారెడ్డి, దేవస్థానం సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

## కొర్రపాటివారిపాలెంలో ఫ్లాగ్ మార్చ్

తాళ్లూరు, మేజర్‌న్యూస్: తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోగల కొర్రపాటి వారి పాలెం గ్రామంలో జూన్ 4న ఎన్నికల ఫలితాలు దృష్ట్యా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన గాని గొడవలు గాని జరగనీయకుండా తాళ్లూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వైవి రమణయ్య వారి సిబ్బంది ద్వారా బుధవారం కొర్రపాటివారిపాలెం గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏఎస్ఐ మోహన్ రావు పోలీస్ సిబ్బంది బ్రహ్మనాయుడు, రాములు, ఆదిరెడ్డి, సుజాత, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి** ఈ నెల 4వ తేదీన రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు ఈనెల 30 నాటికీ పూర్తి చేయాలని, అందుకనుగుణంగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి టేబుల్స్ ఏర్పాటు, బ్యారికేడింగ్, సిసి టివి ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎన్నికల ఫలితాల డేటా నమోదు తదితర ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేసే సిబ్బంది ఏర్పాటుతో పాటు ఆ వివరాలను క్రాస్ చెక్ చేసే మరో బృందం నిరంతరం అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని, కౌంటింగ్ విధులకు హాజరగు సిబ్బంది రాజకీయ పార్టీల ఏజెంట్స్ ఆయా నియోజక వర్గాల కౌంటింగ్ కేంద్రాలకు సులభంగా



వెళ్ళేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణతో కలసి నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీన, డి.ఆర్.ఓ శ్రీలత, ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, గిద్దలూరు, వైపాలెం నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు సుబ్బారెడ్డి, కుమార్, లోకేశ్వరరావు, జాన్ ఇర్విన్, నాగజ్యోతి, డా. శ్రీలేఖ, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరరావు, డిటిసి సుశీల, హౌసింగ్ పిడి పేరయ్య, ఆర్అండ్‌బి ఎస్.ఈ దేవనందం, నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# గ్రంధాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ

కొత్తపట్నం, మేజర్‌న్యూస్: కొత్తపట్నం శాఖా గ్రంథాలయం నందు వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల చేత కథలు చదివించి వారిచే చెప్పించడం జరిగింది. ఈ శిబిరంలో తెలుగు భాష గొప్పతనాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష అమ్మ భాష వంటిదని తెలుగు భాషలోని తియ్యదనం గురించి తెలియజేస్తూ కొంతమంది కవులు గురించి వారు రాసిన అభినవ గేయాలు తెలుగు పద్యాల గురించి విద్యార్థులకు వివరించారు. పద్యం అర్థాలు భావం పద్య రూపంలో పాడి వినిపించడం జరిగింది. అలాగే విద్యార్థులకు చిన్నచిన్న ప్రశ్నల ద్వారా జవాబులు రాబట్టడం చాలా ఆసక్తికరంగా జరిగింది. అలాగే కొందరు కవులు చిత్రపటాలు గురజాడ అప్పారావు ఎర్రన్న గిడుగు వెంకట్ రామమూర్తి చిత్రాలను చూపించడం జరిగింది. తరువాత ఉపాధ్యాయులు పురిణి శ్రీను గణితం మీద గమ్మత్తయిన పజిల్స్ విద్యార్థులకు చూపించి వారి నుండి



సమాధానం రాబట్టడం జరిగింది తదుపరి ఒక విద్యార్థి తన టాలెంట్ తో ఒక కూలర్ తయారు చేసి ప్రజంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ వేసవి శిక్షణ శిబిరాలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవలసినదిగా అలాగే తల్లితండ్రులు కూడా వారి పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లే విధముగా ప్రోత్సహించాలని గ్రంథపాలకుడు సి.హెచ్.అజయ్ బాబు కోరారు.

## శేషంవారి పాలెంలో కార్డన్ సెర్చ్

దర్శి, మేజర్‌న్యూస్: మండలంలోని శేషంవారిపాలెం గ్రామంలో దర్శి సిఐ షేక్ షమివుల్లా దర్శి ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు గ్రామాలలో తనిఖీలు చేయాలని కోరారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వారు వచ్చిన పోలీస్‌లకు తెలియచేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకుండా ఎలక్షన్ గొడవలో పాల్గొన్న వారి పై బైండోవర్ కేసులు, రౌడీ షీట్ల తెరవాలని కోరారు. గ్రామాలలో ప్రజలు శాంతి



భద్రతలు అదుపులో ఉండే విధంగా నడుచుకోవాలని పోలీసులకు సహకరించాలని సిఐ ప్రజలను కోరారు.

### డాక్యుమెంట్లు పోయినవి

ప్రకాశం జిల్లా, ఒంగోలు టౌన్, రాజీవ్‌నగర్ నివాసం రావిపూడి వెంకటేశ్వర్లు గారి కుమారుడు రావిపూడి సతీష్‌బాబు అను నేను ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా తండ్రి గారైన రావిపూడి వెంకటేశ్వర్లు గారు తే. 31-08-2004 దిన నా పేరిటకు దఖలు దస్తావేజును వ్రాయించి మార్టూరు స.రి. వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 1460/2004 రుగా రిజిస్టరు చేయించియుండగా నేను తే. 23-05-2024 దిన ఒంగోలు కర్నూల్ రోడ్డులో గల యస్.బి.ఐ. బ్యాంక్ వద్ద ఆటో ఎక్కుతుండగా ఒరిజినల్ డాక్యుమెంటు జారిపడిపోయినాయి. కావున ఎవరికైనను దొరికిన యెడల సెల్‌నెం : 9985558030 తెలియజేయగలరు.

**ఇట్లు రావిపూడి సతీష్‌బాబు**
**రాజీవ్‌నగర్,**
**ఒంగోలు టౌన్,**
**ప్రకాశం జిల్లా.**
**సెల్ నెం: 9985558030**

# ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించుకుందాం

**- కౌంటింగ్ అనంతరం గొడవలు, అల్లర్లు, పరస్పర దాడులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్**





కనిగిరి, మేజర్‌న్యూస్: ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చిన దాని స్వాగతించాలని, రాజకీయ పార్టీలు గెలుపోటములను సమానంగా చూడాలని, ఎన్నికల తర్వాత గానీ, కౌంటింగ్ తర్వాత గాని, ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని, ఘర్షణలకు పాల్పడరాదని, గొడవలు, కొట్లాటలు, పరస్పర దాడులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హెచ్చరించారు. జూన్ 4న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నేపథ్యంలో స్థానిక పవిత్ర ఫంక్షన్ హాలులో కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించిన, ఎవరి చర్యలపైనైనా అనుమానం వచ్చిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా అలాంటి వ్యక్తులను బైండోవర్ చేసామని, వారిలో ఎవరైనా బైండోవర్ నియమాలు ఉల్లంఘించి గొడవలు, అల్లర్లు, ఇతర నేరాల్లో పాల్గొంటే కనీసం లక్ష రూపాయల నుండి 2 లక్షల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది లేదా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా గ్రూప్స్‌లో ఫేక్ ఫోటోలు, వీడియోలు, కుల, మత, రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా పోస్టు పెట్టడం, అవాస్తవ సమాచారం షేర్ చేయకుండా గ్రూప్ అడ్మిన్ ముందస్తు చర్యలు తీసుకోవాలని, లేని యెడల పోస్ట్ చేసిన వారిపై అలాగే గ్రూప్ అడ్మిన్ పై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు .కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయుటకు సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మందుగుండు సామాగ్రిని కాల్చకూడదని, పెట్రోల్ బంకు ఓనర్లకు నోటీసులు జారీ చేయటం జరిగిందని, వాహనదారులు, వినియోగదారులకు ఎట్టి పరిస్థితుల్లో బాటిల్స్ పెట్రోల్ పోయవద్దని సూచించారు.ఎవరైనా లూస్ పెట్రోలు బాటిల్స్ లో నిలువు చేసిన, అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని, ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు .ఎన్నికల సరళిని ప్రశాంతంగా జరిపేందుకు సహకారం అందించారు మరియు అదే విధమైన సంయమనం, సహకారం ఎగ్జిట్ పోల్స్ మరియు ఎన్నికల ఫలితాల రోజులలో కూడా పాటించాలని తెలియజేశారు. గ్రామాల్లో ఎవరైనా క్రొత్త ,అనుమానాస్పదంగా వ్యక్తుల గురించి, మరియు ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగే అవకాశం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.ఈ సమావేశంలో కనిగిరి డిఎస్పీ ఆర్ రామరాజు, కనిగిరి సీఐ డి వెంకటేశ్వరరావు, పామూరు సీఐ రామ్ నాయక్, కనిగిరి సబ్ డివిజన్ ఎస్సైలు త్యాగరాజు, శివనాగరాజు, రమేష్ బాబు, శివ, ప్రేమకుమార్ ,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండలంలో యథేచ్ఛగా రెవెన్యూ భూమాయాజాలం

**- ప్రభుత్వ పశువుల బీడు భూమి ధారాదత్తం**

**- పెదగోగులపల్లె రెవెన్యూలో అక్రమాలపై మాజీసర్పంచ్ ఫిర్యాదు**

**- తప్పుడు సమాచారం ఇస్తున్న మండల రెవెన్యూ సిబ్బంది**

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ పశువుల బీడుభూములను ప్రభుత్వస్థలాలను వంకపోరంబోకును సైతం వదలకుండా యథేచ్ఛగా గ్రామానికి సంబంధంలేని ఇతరప్రాంతాలకు చెందిన వారిపేర్లమీద అనువంశికం పేరుతో కంప్యూటరీకరణ చేసి రికార్డులను తారుమారు చేస్తున్నారని ఇందుకు ఉదాహరణగా మండలంలోని పెదగోగులపల్లె రెవెన్యూలో సర్వేనెంబర్ 639లో 27.74 ఎకరాల భూమి ఎఫ్‌యల్‌ఆర్‌లో ప్రభుత్వ పశువులమేత భూమి ఉన్నట్లు బీడుపోరంబోకు స్థలాన్ని మండల అధికారులు ఎలాంటి కన్వర్షన్ బియస్ఓ, డి.నోటిఫికేషన్ లేకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వాకాకృష్ణమూర్తి, మాదాలశ్రావణి అనురైతులకు ధారాదత్తం చేసి కేవలం ఎఫ్ యల్ ఆర్ నందు 639 సర్వేనెంబర్ సబ్ డివిజన్ కాకుండా భిన్నాలు చూపించి 639/1,639/2 సర్వేనెంబర్లు వేసి 1బి,10(1)అడంగల్ ఆన్లైన్ చేశారని తెలిసి గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ పునుగుపాటి రవికుమార్ మండల తహశీల్దారుకు పిర్యాదుచేయగా తహశీల్దార్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కనిగిరి రెవెన్యూ డివిజన్ అధికారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో సమాచారహక్కు చట్టం కింద 18-12.2023లో పిర్యాదుచేసినట్లు తదుపరి 20-12-2023న జిల్లా జాయింట్ కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు సర్వేనెంబర్ 639 భూమికి సంబంధించి వెబ్ ల్యాండ్ నందు అనాధీనం అని ఉన్నట్లు తెలిపి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారని సబ్ డివిజన్ కాకుండా భిన్నాలుగా విభజించి సర్వేనెంబర్ 639/1లో 4-25సెంట్లు మాదాల శ్రావణి భర్త హరిప్రసాద్, సర్వేనెంబర్ 639/2లో 5-00 ఎకరాలు వాకా కృష్ణమూర్తి తండ్రి నరసింహ అనుపేర్లతో ఆన్లైన్ చేశారని వీటిపై మరలా స్పందనలో పిర్యాదుచేసినట్లు అంతేకాకుండా మార్చి 2023 సంవత్సరం నుండి ప్రభుత్వభూమిని అనువంశికం కింద వెబ్ ల్యాండ్ నందు నమోదు చేశారని మండల తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది అవినీతి భూమాయాజాలంపై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని మాగ్రామ పశువులబీడు భూములను కాపాడాలని అదేవిధంగా జిల్లాఉన్నతాధికారులు పెదగోగులపల్లె గ్రామరెవెన్యూ పరిధిలో 2023 మార్చి నెల నుండి జరిగిన భూముల వ్యవహారంపై రెవెన్యూ రికార్డులను పరిశీలించి అక్రమంగా ఉన్నవాటిని తొలగించి రద్దుచేయాలని అందుకు కారణమైన స్థానికరెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ రవికుమార్, పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

# కనిగిరి ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎమ్ సుధాకర్

కనిగిరి, మేజర్‌న్యూస్: జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి.సుధాకర్ బుధవారం కనిగిరి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో



నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంకును సందర్శించి అక్కడ జరుగుతున్న పని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసి డిపోలోని మరుగుదొడ్లును, పరిసరాలను సందర్శించి ప్రతిరోజూ డిపో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని బస్ సర్వీసులు, కార్గో కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.శివన్నారాయణ, అసిస్టెంట్ మేనేజర్లు చిన్నయ్య సూరి, రమణమ్మ, ప్రసాద్ రాణి పాల్గొన్నారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉలవపాడు, మేజర్‌న్యూస్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ఎన్.విజయ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావలసిందిగా ఆమె కోరారు.

# సుల్తాన్ ప్లాజా లాడ్జింగ్‌ను ప్రారంభించిన ముత్తుముల



కంభం, మేజర్‌న్యూస్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ఆల్ఫా స్కూల్ ఎదురుగా నూతనంగా సుల్తాన్ ప్లాజా లాడ్జింగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు మాజీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆయన చేతులు మీదుగా సుల్తాన్ ప్లాజాను ప్రారంభించారు. కంభంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరులో అద్భుతంగా పనిచేశారని**

**ఇంటూరిని అభినందించిన చంద్రబాబు**



కందుకూరు, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ని హైదరా బాదులోని ఆయన నివాసంలో కందుకూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల సరళి, పెరిగిన పోలింగ్ శాతం, తదితర అంశాలను చంద్రబాబు నాయుడుకు నాగేశ్వరరావు వివరించారు. నేతలు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పనిచేశారని, ఈసారి కందుకూరులో ఘన విజయం సాధించబోతున్నామని నాగేశ్వరరావు వివరించగా... అద్భుతంగా పనిచేశారంటూ చంద్రబాబు నాయుడు అభినందించారు.

# సాంబయ్య కుటుంబాన్ని పరామర్శించిన గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గం ముండ్లమూరుకు చెందిన రిటైర్డ్ వీఆర్వో బోడపాటి సాంబశివరావు (67) అనారోగ్యంతో మృతి



చెందారు.పార్థివదేహానికి దర్శి ఎన్.డి.ఎ కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలియజేసిన కూటమి ఉమ్మడి అభ్యర్థిడాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంకు ముందుగా దోద్దాల రామయ్య కుమారుడు అనిల్ ఎన్నికల సమయంలో ఓటు వేసి ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో గాయ పడిన అనిల్‌ను గొట్టిపాటి లక్ష్మి ఆమె భర్త డాక్టర్ లలిత్ సాగర్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మాజీ మండల పార్టీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీను, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, బేతపూడి రామారావు, మాజీ సర్పంచ్ బ్రహ్మేశ్వరరావు, గోపనబోయిన ఫిలిప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



సంతమాగులూరు, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన సంతమాగులూరు లోని గ్రంథాలయంలో ప్రతిరోజు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాల కులు విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు బుధవారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన విజ్ఞాన శిబిరంలో వివిధ రకాలైన పోటీలు నిర్వహించినట్లు గ్రంథ పాలకులు విజయ్ భాస్కర్ రెడ్డి తెలియజేశారు

# గ్రంథాలయంలో ఆటల పోటీలు

ఉలవపాడు, మేజర్‌న్యూస్: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉలవపాడు



శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వర రావు ఆధ్వర్యంలో విద్యార్థులతో చిన్నపిల్లల కథలు, సైన్సు విజ్ఞాన పుస్తకాలు చదివించిన,అనంతరం పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత శక్తిని వెలికి తీసే క్రమంలో 100 మీటర్ల పరుగు పందాలు బుధవారం నిర్వహించారు. పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న తల్లిదండ్రులకు గంధపాలకుడు ధన్యవాదాలు తెలిపారు.

## బంగినపల్లి మామిడి తోటల్లో పునాస కాపు

ఉలవపాడు, మేజర్‌న్యూస్: సాధారణంగా పునాస మామిడి తోటల్లో ఈ సమయంలో కోతలు వస్తాయి. పునాస కాపు ఎడాకారు కాపు కాసే మామిడి తోటలు పునాస తోటల్లో మే నెల నుంచి డిసెంబర్ వరకు పూతలు కాయలు వస్తాయి. బంగినపల్లి రకం మామిడి తోటల్లో డిసెంబర్ నుంచి మార్చి మధ్య పూతలు వస్తాయి. ఇది సాధారణ సీజన్ ఈసారి విశేషం ఏమి టంటే పునాస తోటలు తోపాటు బంగిన పల్లి మామిడి తోటల్లోనూ ఇప్పుడు పూతలు



వస్తున్నాయి. మండలంలో నూటికి 90శాతం తోటల్లో డిసెంబరు మార్చి మధ్య పూతలు రాలేదు. ప్రతికూల వాతావరణం వల్ల అప్పటిలో పూతలు నిలిచిపోయాయి. అలాంటి తోటల్లో ఇప్పుడు బంగినపల్లి చెట్లల్లో పూతలు వస్తున్నాయి. మండలంలోని చాకిచర్ల,మన్నేటికోట వంటి కొన్ని గ్రామాల్లో బంగినపల్లి మామిడి తోటల్లో పూతలు కనిపిస్తున్నాయి.ఈ పూతల్లో పిందెలు కూడా పడుతున్నాయి. ఈ పూతలు పిందెలు ఎంతవరకు నిలుస్తాయో కానీ నిలిస్తే మాత్రం రైతులకు పండగే ఎడకారు సమయంలో కాసే బంగినపల్లి మామిళ్ళకు లాభసాటి ధరలు పలుకుతాయి. మండలంలోని బంగినపల్లి తోటల్లో మే నెలలో గతంలో ఏనాడు పూతలు రాలేదు. కొన్ని సందర్భాల్లో అనుకూల వాతావరణం వల్ల అక్టోబర్ లో పూతలు వచ్చాయి. ఈసారి అక్టోబర్‌కు ముందే మే నెలలోనూ బంగినపల్లి మామిడి చెట్లల్లో పూతలు రావడం విశేషంగా ఉంది.

## మండలంలో కార్డెన్ సెర్చ్





తర్లుపాడు, మేజర్‌న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కౌంటింగ్‌కు ముందు, అనంతరం సమస్యాత్మక గ్రామాల్లో చెలరేగే అల్లరి మూకల ఆగడాలను అరికట్టేందుకే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సర్చ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పొదిలి సీఐ మల్లికార్జున పేర్కొన్నారు. అందులో భాగంగానే పొదిలి సర్కిల్ పరిధిలోని మండల కేంద్రమైన తర్లుపాడు, బుడ్డపల్లి, తుమ్మల చెరువు గ్రామాల్లో నిర్వహించామన్నారు. అందులో భాగంగానే పోతలపాడు గ్రామంలో కూడాఎలాంటి హింసాత్మక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త గా గ్రామంలోనిప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో గుర్తుతెలియని వాహన దారులు సంచరిస్తున్న, వారి వద్ద హింసాత్మక చర్యలకు పాల్పడే వస్తువులు ఉన్నట్టు తెలిసిన, వారి వాహనాలకు ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకపోయినప్పటికీ అలాంటి వారందరినీ అదుపులోనికి తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. గ్రామాల్లో విధ్వంసాలను సృష్టించే వారిని, ప్రమాదకరమైన వస్తువులు దాచిన వారిని గురించి సమాచారాన్ని పోలీసులకు తెలియపరిచిన వారి పేర్లనుగోప్యంగాఉంచుతామన్నారు. గ్రామాల్లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో స్నేహ పూర్వక వాతావరణం కలిగి కలిసిమెలిసి ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల ఎస్సై వేముల సుధాకర్, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శింగరకొండలో నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం





అద్దంకి, మేజర్ న్యూస్: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శింగరకొండలో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 30న ప్రారంభమై మూడు రోజులపాటు అనగా జూన్ ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. అందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ టి సుభద్ర నేతృత్వంలో సిబ్బంది పూర్తి చేశారు. పిలిచిన పలికే దైవంగా విరాజిల్లుతున్న ప్రసన్నాంజనేయస్వామికి ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు వార్షిక తిరునాళ్ల నిర్వహిస్తుండగా, వైశాఖ బహుళ దశమి శనివారం నాడు హనుమజ్జయంతి రావటం విశేషం. ఈ ఉత్సవాలకు బాపట్ల, ప్రకాశం, గుంటూరు,పల్నాడు, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. వేసవి నేపథ్యంలో క్యూలైన్లో ఉన్న వారికి మంచినీరు, మజ్జిగ వంటివి అందించనున్నారు. మూడు రోజుల పాటు ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 40 రోజుల పాటు ఆంజనేయస్వామి దీక్షలు చేపట్టిన భక్తులు వాటిని విరమించనున్నారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న జయంతి ఉత్సవాలు గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయి. ఆలయ ప్రదక్షిణ, పరివారదేవతామూర్తులకు ప్రత్యేక పూజలు,గణపతిపూజ, సహస్రనామ పూజలు జరుగుతాయి. సాయంత్రం సహస్రకదలీఫలార్చన నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ఋత్విక్ వరుణ, సుందరకాండ పారాయణం, చండీ సప్తశతి పారాయణం, సూర్యనమస్కారాలు, మన్యుసూక్తహోమం జరుగుతాయి. సాయంత్రం లక్ష మల్లెలార్చన నిర్వహిస్తారు. ఒకటో తేదీ వేకువజామున 4.45గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. స్వామివారికి అభిషేకం, తమలపాకులు, మల్లెపూలతో అర్చన నిర్వహిస్తారు. ఆంజనేయ స్వామి మాలా దీక్ష చేపట్టిన దీక్షాధారులచే విరమణ చేయిస్తారు.

## ఇంటిపై పెట్రోలు సీసాలు విసిరిన వ్యక్తి అరెస్టు

కనిగిరి, మేజర్‌న్యూస్: పాత గొడవలు మనసులో పెట్టుకొని హత్య చేసేందుకు ప్రయత్నించిన ఒకరిని అరెస్టు చేసినట్లు కనిగిరి డిఎస్పీ ఆర్.రామరాజు తెలిపారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ వెలిగండ్ల మండలం జంగం నర్సాయపల్లి గ్రామానికి చెందిన తిట్ల నారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు నిద్రిస్తుండగా మంగళవారం




వేకువ జామున 2.10 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన కటుకూరి అనంత బాల, కటుకూరి రహీమ్‌లు పాత గొడవలు మనసులో పెట్టుకొని పెట్రోలు నింపిన బీరు సీసాలకు నిప్పంటించి నారాయణ ఇంటిపై విసరగా ఇంటి గేటు తగిలి మంటలు వ్యాపించాయి. ప్రక్కనే ద్విచక్ర వాహనం ఉన్నదని వెంటనే నారాయణ కుటుంబ సభ్యులు లేచి మంటలు ఆర్పక పోతే వాహనం తగలబడి ప్రాణ ఆస్తి నష్టం జరిగి ఉండేదని తమను చంపాలనే ఉదేశ్యంతో వచ్చినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు డిఎస్పీ తెలిపారు. 2020 కోవిడ్ సమయంలో పిర్యాదు దారునికి నిందితులకు మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయని దానిని మనసులో పెట్టుకొని పెట్రోలు నింపిన బీరు సీసాలకు నిప్పు అంటించి విసరారని చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి డిఎస్పీ ఆధ్వర్యంలో 3 బృందాలను ఏర్పాటు చేసి కేసులోని ప్రధమ ముద్దాయి కె.అనంత బాలను నాగులవరం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో అరెస్టు చేయగా నేరాన్ని అంగీకరించినట్లు డిఎస్పీ రామరాజు వివరించారు. రెండవ ముద్దాయి కె.రహీం పరారీలో ఉన్నాడని త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. కేసును త్వరిత గతిన ఛేదించిన పామూరు సర్కిల్ పోలీసు అధికారులను, సిబ్బందిని డిఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో పామూరు సీఐ రామ నాయక్, సి.ఎస్.పురం ఎస్సై ప్రేమ్ కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## అంబేద్కర్ యూత్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మార్టూరు, మేజర్‌న్యూస్: అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నేతాజీ నగర్ రాంనగర్ చర్చి దగ్గర గ్రౌండ్లో బుధవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కి ఇప్పటికీ



32 టీములు క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నట్లు కమిటీ నిర్వాహకులు బిక్కి రమేష్, గొట్టిపాటి ప్రవీణ్ తెలిపారు. ప్రధమ బహుమతి రూ.20వేలు కామినేని జనార్ధన్, ఉప్పుటూరి రమాదేవి ద్వితీయ బహుమతి రూ.15వేలు, అద్దేటి అనిల్ కుమార్ తృతీయ బహుమతి రూ.10వేలు, సాంబశివ పెయింట్స్ ప్రొ.వెంకటేష్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ పుట్టా అయ్యప్ప స్వామి, ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ బహుమతులు షేక్ ఫరూక్, కన్నెగంటి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు టోర్నమెంట్‌కి సహాయ సహకారాలు అందిస్తున్నారు. టోర్నమెంటును పుట్టా అయ్యప్ప స్వామి, గొట్టిపాటి ప్రభాకర్, గొట్టిపాటి వెంకట్రావు, మందపాటి అంజయ్య ప్రారంభించారు.

## అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్టు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో బుధవారం అక్రమంగా మద్యం నిలువ ఉంచిన ఓ వ్యక్తిని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద నుండి 30(750ఏం.ఎల్) ఫుల్ బాటిల్ల మద్యం సీసాలను



అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం నిలువ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ కొండారెడ్డి తెలిపారు. పట్టుబడ్డ మద్యం గోవా మద్యం అని సిఐ కొండారెడ్డి వెల్లడించారు.

## అమ్మ ఆశ్రమంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

మార్టూరు, మేజర్‌న్యూస్: ఎఫర్ట్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహన్ రావు అనురాధ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా స్థానిక అమ్మ ఆశ్రమానికి మినరల్ వాటర్ ప్లాంట్ అందజేశారు. వృద్ధులు మంచినీళ్లకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో 70 వేల రూపాయలు విలువగల మినరల్ వాటర్ ప్లాంట్ ను మోహన్ రావు అనురాధ దంపతులు అందజేసి ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో సినీ, సీరియల్స్ నటులు



వెంకట్ చౌదరి, రోటరీ క్లబ్ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పెళ్లి రోజు సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్స్ పండ్లు పంచి అన్నదానం నిర్వహించారు. ఎంతో పెద్ద మనసుతో వాటర్ ప్లాంట్ అందించిన మోహన్ రావు అనురాధ దంపతులకు ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు ధన్యవాదాలు తెలియజేశారు.

## జగన్ సియం కావాలని చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: జగన్ మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని, ఒంగోలు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తాడిపర్తి చంద్రశేఖర్ అత్యధిక మెజార్టీతో గెలవాలని పుల్లలచెరువు సోషల్ మీడియా సభ్యులు ఆధ్వర్యంలో



ఎర్రగొండపాలెం నుండి శ్రీశైలం వరకు చేస్తున్న పాదయాత్ర బుధవారం సాయంత్రం కర్నూలు గుంటూరు రహదారిపై జమ్మిదోర్నాల స్టేజి దగ్గరికి చేరుకోగా పాదయాత్ర చేస్తున్న వారికి జమ్మి దోర్నాల వైఎస్ఆర్సిపి యూత్, నాయకులు సంఘీభావం తెలియజేయడం జరిగినది. సర్పంచి కొంగ వెంకటరామయ్య, చాట్ల గంగయ్య, పులుకూరి జయరావు, పులుకూరి దానియేలు, పులుకూరి నాగేశ్వరరావు, పులుకూరి రాజేష్, చాట్ల రాజు, పులుకూరి కోటేష్, పులుకూరి బాల యేసు, చాట్ల డిక్షన్ బాబు, పాల్గొన్నారు.

## పశు వైద్యశాల తనిఖీ

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ముండ్లమూరు పశు వైద్యశాలను జిల్లా వైద్యధికారిణి కె.బేబీ రాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యా లయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మేకలు, గొర్రెలలో చాటు వ్యాధి పరిశీలించి వాటికి టీకాలు వేయించాలని



కోరారు. పశు పోషకులు చాట్ వ్యాధికి ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట దర్శి ఎ.డి.ఎ పురుషోత్తమ్ రాజు, స్థానిక వైద్యధికారిణి యం.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది సమన్వయంగా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో అధిగమించాలని జిల్లాపంచాయతీ అధికారిణి టి.ఉషారాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రత్యేక శ్రద్ధవహించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రానున్న వర్షాలకు ముందుజాగ్రత్తగా అంటువ్యాధులు వ్యాపించకుండా గ్రామాలలో సైడుకాలువలు మురుగునీరు కుంటలు చెత్తాచెదారం లేకుండా చూడాలని అదేవిధంగా సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని గ్రామపంచాయతీ పరిధిలో నూరుశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని పంచాయతీల ద్వారా గ్రంధాలయసంస్థకు సెస్ చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని సచివాలయంలలో ఈసేవల డబ్బులు వెంటనే బ్యాంకుల్లో జమచేయాలని తెలిపి మండల అధికారులు సచివాలయంల సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజలసమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలుకు కృషిచేయాలని నిర్లక్ష్యంగా వ్యవరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈసమావేశంలో డిపిఓ ఉషారాణి, ఎంపిడిఒ కృష్ణయ్య, ఇఒపీఆర్డీ సుందరరామయ్య,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం లో బుధవారం భౌతిక శాస్త్రం పరీక్షకు 76 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 36 మంది హాజరైనారు, 40 మంది విద్యార్థులు గైహాజరైనారని డిపార్ట్మెంటల్ ఆఫీసర్ డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలియజేశారు. విద్యార్థులను పరీక్ష కేంద్రం వెలుపలనే క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి పంపించారు. పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన గిద్దలూరు మండల విద్యాశాఖాధికారి-2 జింకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా, పకడ్బందీగా నిర్వహించడానికి ఇన్విజిలేటర్లు సమర్థవంతంగా విధి నిర్వహణ చేస్తున్నరన్నారు. పరీక్ష కేంద్రం బయట పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. సెంటర్ నందు రిజిస్టర్ల మెయింటెనెన్స్ సక్రమంగా నిర్వహిస్తున్నామని చీఫ్ టీ.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## సాదాసీదాగా మండల పరిషత్ సాధారణ సమావేశం

అద్దంకి, మేజర్ న్యూస్: అద్దంకి మండల పరిషత్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కేవలం అధికారులు నివేదికలకే సమావేశం పరిమితమైంది.వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందిస్తున్నామని మండలవ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. వ్యవసాయాధికారి తోపాటు ఎంఈవో డి.గంగాధర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అనూష మాట్లాడారు. ఉప్పలపాడు, వెంపరాల, మైలవరం గ్రామాల ప్రజలు సహకారం అందించనందునే ఆయా గ్రామాల చెరువులను సాగర్ నీటితో నింపలేక పోయామన్నారు. తిమ్మాయపాలెం ఎంపీటీసీ సభ్యులు అడుసుమల్లి బాలమురళీకృష్ణ మాట్లాడుతూ సాగర్ నీటిని గుండ్లకమ్మకు మళ్లించడం ద్వారా ఎత్తిపోతల పథకాలు మంచినీటి పథకాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఏఈ బదులిచ్చారు. మొత్తం మీద ఇరవై నిముషాల్లో సమావేశం ముగించారు. ఎంపీడీవో జీ.వీ.సత్యనారాయణ సంధానకర్తగా వ్యవహరించారు.

# నాగులచెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని నాగుల చెరువు ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ కనిగిరి ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని, పట్టణంలోని ప్రధానంగా నీటి వనరులుగా ఉన్న నాగుల చెరువులోకి వర్షపు నీరు చేరకుండా కాలువలను క్వారీ యజమానులు, గ్రానైట్ కంపెనీలు, రియాల్టర్ వ్యాపారులు ఆక్రమించుకొన్నారని తెలిపారు .కొండవాగు నీటిని నాగుల చెరువులోకి చేరకుండా ఆక్రమించినందున చెరువులోకి నీరు చేరడం లేదన్నారు. చెరువులో నీరు లేక పట్టణంలోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. వర్షాలు పడినప్పుడు నీరు చెరువులోనికి చేరితేనే పట్టణములోని బోర్లలో, బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు. పట్టణంలో నీటి సమస్యతో చాలామంది పట్టణం వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నాగుల చెరువులోకి నీరు



చేరకుండా నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న క్వారీ యజమానులు, గ్రానైట్ కంపెనీలు, రియల్టర్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి సత్రముల అధ్యక్షులు దేవకీ వెంకటేశ్వర్లు, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, బాలయ్య, బొట్టు శ్రీనివాసులు, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు న్యాయం చేయాలి

చీరాల, మేజర్ న్యూస్: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ డిమాండ్ చేశాడు. మండలంలోని కావూరివారిపాలెం పంచాయితీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో బుధవారం టి కృష్ణమోహన్ మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉపాధి హామి పథకంలో రెండు పూటల పని పెట్టి కూలీలను ఇబ్బందు లకు గురిచేస్తున్నారని మండి పడ్డారు. గత సంవత్సరం బడ్జెట్‌లో 90వేల కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం 60వేలు మాత్రమే కేటాయించి, నిధులను తగ్గించారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు రోజుకు కనీస వేతనం రూ.600లు కూలీ లకు చెల్లించాలని, సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించకపోతే కూలీలందరు వ్యవసాయ కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మోజెస్, శ్యామ్ పాల్గొన్నారు.



## ముగిసిన ఉద్యానవన శిక్షణా శిబిరం

చీరాల రూరల్, మేజర్ న్యూస్: గత మూడు నెలల నుంచి బేతపూడి పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఉద్యానవన పంటలపై జరుగుతున్న శిక్షణా శిభిరం నేటితో ముగిసిననట్లు వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు.



మండలంలోని కావూరివారిపాలెం పంచాయితీ పరిధిలోని బేతపూడి గ్రామంలో కందుకూరు వ్యవసాయ కళాశాల విద్యార్థుల శిక్షిణ బుధవారంతో ముగిసిందని రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ విజయ పద్మ రైతు సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జీడి మామిడి పరిశోధణ సంస్థ శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు గెలుపు, ఓటములను సమన్యాయంతో తీసుకోవాలి



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: క్రీడాకారాలు గెలుపు ఓటములును సమన్యాయంతో తీసుకోవాలని, స్నేహ పూరిత వాతావరణంలో క్రీడలు జరగాలని జిల్లా తెలుగు యువత నాయకులు బేతపూడి రామారావు అన్నారు. ముండ్లమూరు పంచాయతీ పరిధిలోని వేంపాడు గ్రామంలో దర్శి నియోజకవర్గం జనసేన నాయకులు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిటెన్నిస్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఆ పోటీలను టిడిపి



నాయకులు బేతపూడి రామారావు ప్రారంభించారు. ఈ పోటీలో మొదటి ప్రైజ్ 25 వేల రూపాయలును ఎన్.ఆర్.ఐ మేదరమెట్ల అజయ్ 25 వేల రూపాయలు మొదటి బహుమతి అందిస్తుండగా రెండొవ బహుమతి బేతపూడి రామారావు15 వేలు, మూడోవ బహుమతి మాజీ ఆర్మీ ఉద్యోగి రాగిపిండి నాగేశ్వరరారెడ్డి 10 వేలు రూపాయలు విలువ కల్గిన ప్రైజ్ లు అందించనున్నారు. ఈ పోటీలో 65 టీం పాల్గొన్నాయని తెలిపారు. బుధవారం ఉదయం అద్దంకి, ఊళ్ళగాళ్లు టీంలు తలపడగా ఊళ్ళగాళ్లు జట్టు విజయం సాధించిందింది. దర్శి మండలంలోని బోట్లపాలెం, శంకరాపురం పోటీలో పాల్గొనగ శంకర పురం జట్టు విజయం సాధించింది. కార్యక్రమం నకు ముందుగా క్రీడాకారులును రామారావు పరిచయం చేసుకున్నారు.

## గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు



అద్దంకి, మేజర్ న్యూస్: విజ్ఞానాన్ని పంచే భాండాగారాలు గ్రంథాలయాలు అని, ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దే సరస్వతి నిలయాలు గ్రంథాలయాలు అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. బంగ్లా రోడ్డు నందు గల అద్దంకి శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 15వ రోజు బుధవారం జరిగింది. గ్రంథ పాలకుడు సుగుణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 20 మందిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమమునకు ఫ్యాకల్టీగా సాయి పబ్లిక్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం ప్రిన్సిపాల్ వీర్రాజు డ్రాయింగ్ ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులకు డ్రాయింగ్ స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. విద్యార్థులకు బహుమతులు మరియు స్వీట్స్ ను మందా జోసఫ్ మరియు రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి తాళ్లూరి బాబురావు అందించారు.

## పట్టణంలో సీఐ సోమయ్య కార్డెన్ సెర్చ్

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని రాజా నగర్, పట్టణంలో గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు.



ఈ కార్డెన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్య వెల్లడించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నమని సీఐ సోమయ్య అన్నారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కారు ఆర్టీసీ బస్సు ఢీ



రేపల్లె, మేజర్‌న్యూస్: రేపల్లె భట్టిప్రోలు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇరువురు వ్యక్తులకు తీవ్ర గాయాలైనసంఘటన చోటుచేసుకుంది. రేపల్లె ఆర్టీసీ డిపోకు చెందిన రేపల్లె- గుంటూరు ఎక్స్ప్రెస్ ఏపీ జీరో 7..0522 గుంటూరు నుండి రేపల్లె కు వస్తున్న సమయంలో అతివేగంగా వస్తున్న కారు ఓలేరు - పేటేరు టర్నింగ్ వద్ద ఆర్టీసీ బస్సు ను ఢీ కొట్టడంతో బస్సు చక్రాల క్రిందకు కారు ఇరుక్కుపోయి అందులో ప్రయాణిస్తున్న ఇరువురు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురైనట్లు తెలియ వచ్చింది. వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు కారు బస్సు డ్రైవర్లను విచారించి పోలీస్ స్టేషన్కు తరలించారు క్షతగాత్రులైన ఇరువురిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేపల్లె పట్టణ పోలీసులు తెలిపారు బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు అతివేగమే కారు ప్రమాదానికి కారణమని పోలీసులు నిర్ధారించారు.

## విత్తన నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: రైతులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను మాత్రమే అమ్మాలని, వాటన్నింటికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, లేకపోత కఠిన చర్యలు తప్పవని, లైసెన్సులు కూడా రద్దు చేయబడతాయని మండల వ్యవసాయధికారి, మరియు క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.ప్రసాదరావు తెలిపారు . తూర్పుగంగవరంలోని వెంకట సాయి రైతు డిపోను తనిఖీలు నిర్వహించారు. వరి ఎపిటిఎస్204 పచ్చపెన లు విత్తనాలను శాంపిళ్ళను తీసుకొని, క్యాలిటీ పరీక్షల నిమిత్తం - తాడేపల్లిగూడెం పంపించడం జరిగిం దని ఆయన అన్నారు. పరీక్షల ఫలితాలు రాగానే, నాణ్యా త ప్రమాణాలను బట్టి తదుపరి చర్యలుంటా యని, కాబట్టి ధృవీకరించిన విత్తనాలను మాత్రమే విక్రయిం చాలి. అనుమతులు లేనివైనా, లూజు విత్తనాలైనా, నాణ్యత లో పంఉన్నా, తప్పని సరిగా కఠిన చర్యలుంటా యని ఎఓ అన్నారు. కార్యక్రమంలో ఎఇఓ నాగరాజు, డీలర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



పామూరు, మేజర్‌న్యూస్: మండలంలోని బొట్లగూడూరు సబ్ స్టేషన్ మరమ్మత్తుల నేపథ్యంలో నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏఈ జిలాని తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్తంభాలను మరమ్మత్తులు చేస్తున్న నేపథ్యంలో బొట్లగూడూరు సబ్ స్టేషన్ పరిధిలో కొన్ని రోజులపాటు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారుల గమనించి సహకరించాలని కోరారు.

# కాలేజ్ డే- హాస్టల్ డే ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



బాపట్ల, మేజర్‌న్యూస్: వ్యవసాయ కళాశాల బాపట్లలో 79వ కళాశాల దినోత్సవం 30/5/24 న వసతి గృహ దినోత్సవాన్ని 31/5/24 న నిర్వహించనున్నారు అని కళాశాల అసోసియేట్ డీన్ డా. వి. శ్రీనివాసరావు.ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్. శారదా జయ లక్ష్మి హాజరుకానున్నారు అని తెలియజేసారు. కళాశాల దినోత్సవానికి ముఖ్య అతిథిగా డా. జి. ఎస్.జి. అయ్యంగార్ ( ఐ. ఏ. ఎస్) రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విచ్చేయనున్నారని తెలియజేసారు. విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా. జి. కరుణా సాగర్, డీన్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ డా. ఎ.వి.రమణ హాజరుకానున్నారు అని తెలియజేసారు. కళాశాల దినోత్సవాలలో భాగంగా చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి, విద్యార్థినిలకు బంగారు పతకాలు, బహుమతులను అందచేస్తారు అని పేర్కొన్నారు. గత సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలతో పాటు విద్యార్దిని, విధ్యార్థులచే రచించిన కవితలు,వ్యాసాలతో కూడుకున్న హరిత మేగజైన్ ఆవిస్కరిస్తారు అని తెలియజేసారు.వసతిగృహ దినోత్సవానికి ముఖ్య అతిథిగా సీహెచ్.పి.వి. సాంబశివరావు డైరెక్టర్ ప్రిజం క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ( హైదరాబాద్) విశిష్ఠ అతిథులుగా పి. రామ్ ప్రసాద్ ఐ ఆర్ ఎస్ - అడిషనల్ కమిషనర్ ఆఫ్ జి స్ టీ, చెన్నై సౌత్ విచ్చేయనున్నారు. ఈ కార్యక్రమానికి డీన్ ఆఫ్ స్టుడెంట్ అఫైర్స్ డా.పి. సాంబ శివరావు, రిజిస్ స్ట్రార్ డా.కె.గురువ రెడ్డి హాజరుకానున్నారు. వసతి గృహ దినోత్సవంలో భాగంగా ఉదయం పూట విద్యార్దిని, విద్యార్థులచే నిర్వహించి పెట్టీ గేమ్స్ మరియు స్టాల్స్ నిర్వహణ, సాయంకాలం కార్యక్రమంలో వసతి గృహంలో పని చేసే వర్కర్స్ కు బట్టలు పంపిణీ చేస్తారు.కళాశాల దినోత్సవం, వసతి గృహ దినోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు తెలిపారు. కాలేజ్ డే వేడుకలు ఓ ఎస్ ఏ డా.పి. వెంకట సుబ్బయ్య , వసత్తి గృహ దినోత్సవం వార్డెన్స్ డా.పి. చంద్ర శేఖర్, డా. ప్రసన్న కుమారి, డా.రత్న కుమారి, డా. మోహన రావు పర్యవేక్షిస్తున్నారు. ఈ పత్రిక సమావేశం లో డా.ఎం. రామా దేవి, డా. టీ. ప్రశాంత్, డా.కె.అచ్యుత్ రావు, డా.వి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి





రేపల్లె, మేజర్‌న్యూస్: కౌంటింగ్ విధులకు కేటాయించిన ఉద్యోగులు అన్ని విధాల అప్రమత్తంగా ఉండి సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పక్రియను పూర్తి చేయాలని రేపల్లె నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్ అన్నారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరం నందు కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు బాపట్ల జిల్లాలోని బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ నందు జూన్ 4వ తేదీ జరుగుతుందని తెలిపారు నాలుగో తేదీ ఉదయం 5 గంటల సమయానికి కచ్చితంగా బాపట్లలోని బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ కి చేరుకోవాలన్నారు లెక్కింపు కు సంబంధించిన టేబుల్స్ వద్ద కంట్రోల్ యూనిట్ వివరాలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం చూసి సరిచూసుకొని వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. కంట్రోల్ ప్యానెల్ లోని ఫలితాలు వెల్లడించేందుకు నిర్వహించే ప్రక్రియ కౌంటింగ్ సూపర్వైజర్లు కౌంటింగ్ అసిస్టెంట్లు మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించవలసిన విధులు పై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తిస్థాయిలో శిక్షణ అందించారు ఎన్నికల డిటి కనక దుర్గ, రేపల్లె తాసిల్దార్ రవీంద్ర బాబు కౌంటింగ్ సూపర్వైజర్లు కౌంటింగ్ అసిస్టెంట్లు మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

# పుస్తకాలను చదివి విజ్ఞానంను పెంపొందించుకోవాలి



దర్శి, మేజర్‌న్యూస్: విద్యార్థులు పుస్తకాలను చదివి విజ్ఞానంను పెంపొదించుకోవాలని జిల్లా గ్రంథాలయం కార్యదర్శి ఆదిలక్ష్మి కోరారు. దర్శి గ్రంథాలయంను బుధవారం ఆమె పరిధిలించారు. శాఖా గ్రంథాలయం దర్శిను ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి వార్షిక తనికీ నిర్వహించి రికార్డులు అన్నింటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమ్మర్ క్యాంప్‌లో హాజరైన విద్యార్థులను కార్యదర్శి సమ్మర్ క్యాంప్‌లో ఏమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంప్‌ను ఉపయోగించుకుని వారి లోని టాలెంట్ బయటకు తీసుకుని రావాలని, గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు కార్యదర్శి ఆదిలక్ష్మి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 30 మంది విద్యార్థులు, బి.డి.సి.ఎల్ బి.కోటయ్య, జి.చెంచు లింగం, గ్రంథపాలకురాలు వి.విజయ కుమారి పాల్గొన్నారు.

# రైతులు భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి



తాళ్లూరు, మేజర్‌న్యూస్: భూమి అనేది ఒక మిశ్రమ సమ్మేళనం దీనిలో ఖనిజ లవణాలు పోషకాలు ఉంటాయి. ఇవి భూమిలో నిలువ ఉండటం వలన భూమిని పోషక కేంద్రం భావిస్తారు. ప్రస్తుతం భూమిలో సారవంతం లేకపోవటం రైతులు భూమిలో పంటలు వేసుకున్న దిగుబడులు రాకపోవడం భూమి పోషక లోపం జరుగుతుంది. ప్రతి ఒక్క రైతు భూసార పరీక్షలు చేయించుకొని భూమిలో ఉన్న లోపా లు తెలుసుకున్నప్పుడే పైర్లలో అధిక దిగుబడి తెచ్చుకొనవచ్చునని మండలంలోని లక్కవరం గ్రామ వ్యవసాయ సహాయకులు కె.వీరాంజనేయులు తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా నేలలు వాటిలోని సహజంగా ఉన్న పదార్థాలతోపాటు, సేంద్రియ, రసాయనిక ఎరువులు అందజేసినప్పుడు పంట దిగుబడికి దోహదపడతాయని తద్వారా రైతులు అధిక దిగుబడి తెచ్చుకోవచ్చని ఆయన తెలియజేశారు. తదుపరి ఎస్సీ రైతుల పొలాలలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు పంపడం జరిగినదని ఆయన తెలిపారు.

## మట్టిఖర్చులకు నగదు అందజేత



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం మండలం పేరలి గ్రామం మేకలవారి పాలెం కి చెందిన అడే ఏలీయా మరణించారు .పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డా. పేరలి బాలకృష్ణ మూర్తి గారి సహాయ సహకారంతో కో ఆర్డినేటర్ పేరలి శ్రీనివాస రావు గేర. ఏసుబాబు గారి చేతుల మీదుగా మట్టి ఖర్చుల నిమిత్తం 5000 అందజేశారు.ఈ కార్యక్రమంలో కాగిత విజయ రాజు, వడ్లమూడి మల్లిఖార్జున్, జోగి రాజేష్, మేకల విక్టోరియ్య, మద్దిబోయిన బుల్లియ్య, కాగిత చిన్న, అడే సామేలు, ఆడే ఏసుపాదం, అడే ప్రభుదాసు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సూర్యలంక తీరాన శివాలయం వార్షికోత్సవం నేడే



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరమున ప్రతిష్టించిన శ్రీ తారకేశ్వరస్వామి, శ్రీ అన్నపూర్ణ దేవి, శ్రీ విజయరాజ గణపతి స్వామి వార్ల మొదటి వార్షికోత్సవము నేడు అంగరంగ వైభవంగా చేయుటకు దేవాలయ కమిటీ వారు ముస్తాబు చేశారు, దేవాలయ కమిటీ అధ్యక్షులైన మంతెన దశరాధ మహారాజు, మంతెన రామకృష్ణ రాజు, డాక్టర్ అడ్డ గడ్డ సుబ్బారావు, మంతెన విష్ణువర్ధన రాజు, సుబ్బారావు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మొదటి వార్షికోత్సవము జరిపించుచున్నారు కావున ఈ కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి తీర్ధ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు ప్రాత్రులు కావాలని కోరారు.

# తెలుగు జాతికి సూపర్‌స్టార్ కృష్ణ చేసిన సేవలు నిరుపమానం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : తొలి కలర్, తొలి సినిమా స్కోప్, తొలి 70 ఎంఎంల తదితర సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలుతనే తెలుగు వారికి అందించడం ద్వారా తెలుగు జాతికి సూపర్ స్టార్ కృష్ణ చేసిన సేవలు నిరుపమానమని దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో సూపర్ స్టార్ కృష్ణ కళాపరిషత్ ఆధ్వర్యంలో సినీ హీరో క్రృష్ణ 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొగిలి దేవ, డిప్యూటీ కలెక్టర్ పేరయ్యలు హీరో క్రృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు డాక్టర్ మొగిలి దేవ సభాధ్యక్షత వహించి మాట్లాడుతూ హీరో క్రృష్ణ అప్పట్లోనే పాన్ వరల్డ్ స్థాయి జేమ్స్ బాండ్ చిత్రాలు, కౌబాయ్ చిత్రాలతో ప్రయోగాలు చేసి తెలుగు సినిమాను ప్రపంచ వ్యాప్తం చేసారన్నారు.
ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ క్రృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ క్రృష్ణ సినిమా విడుదలైతే ఇంటికి కూడా వెళ్ళకుండా రోజంతా నాలుగు ఆటలు చూసేవారమన్నారు. సాహసాలకు, ప్రయోగాలకు క్రృష్ణ వెనుకాడరన్నారు. అనంతరం విధ్యార్ధులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయం ఉప కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఐనంపూడి నరసింహం, సంఘ సేవకులు మారెళ్ళ సుబ్బారావు, ఎం. శ్రీనివాసరావు, నున్నా ఆంజనేయులు, జాలాది మోహన్, నత్తల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విధ్యార్ధులు పాల్గొన్నారు.

## నేటి నుండి బాబా మందిరం వార్షికోత్సవం



ముండ్లమూరు, మేజర్ న్యూస్: మండలంలోని పోలవరం గ్రామంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం సందర్భంగా సాయి బాబా ప్రత్యేక భక్తి కార్య క్రమం జరుగునున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30న సాయిబాబా దేవాలయం వద్ద నుండి ఊరిగింపు కార్యక్రమం మొదలు అయ్యి కార్యక్రమం ప్రదేశంకు చేరుతుంది అన్నారు. 6 గంటలకు దుప హారతి, బాబాకు పుష్ప అభిషేకం, పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు సతస్యంగా ప్రసంగం టివిలో ప్రసారం చేస్తామని అన్నారు. 31న ఉదయం కాకడ హారతి, సుప్రభాతం, బాబా అభిషేకములు, బాబాకు చందోనిత్సవాహం పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.





# 4న సాయంత్రం 5 గంటలకే ఫలితాలు వెల్లడి

### ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు, మేజరన్యూస్: ఓట్ల లెక్కింపు ఫలితాలను జూన్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్ దినేష్ కుమార్ చెప్పారు. కౌంటింగ్ నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలతో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ గరుణ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు కూడా పాల్గొన్నారు. కౌంటింగ్ నిర్వహణకు జిల్లా యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ వేస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం పార్లమెంట్ నియోజకవర్గానికి 40, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి ఐదు చొప్పున టేబుల్స్ వేస్తున్నామని తెలిపారు. తద్వారా సాయంత్రం 5 గంటల కల్లా ఫలితాలు వెల్లడించేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఎస్.పి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్ర ప్రాంగణానికి మూడంచెల భద్రత కల్పిస్తున్నామని చెప్పారు.
ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజున హింసాత్మక ఘటనలపై నితీష్ కుమార్ ఆరా తీయగా, ఈ.వి.ఎంల డ్యామేజీకి కారణమైన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించామని ఎస్.పి. చెప్పారు. కాగా, నియోజకవర్గాల వారీగా కౌంటింగ్కు చేపడుతున్న ఏర్పాట్లపై మార్కాపురం ఆర్.ఓ రాహుల్ మీనా, ఒంగోలు ఆర్.ఓ జి.వి.సుబ్బారెడ్డి కూడా డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కు వివరించారు.

# ఎన్నికల కేసులో ఇరుక్కొని జీవితం నాశనం చేసుకోవచ్చు: జిల్లా ఎస్పీ





బాపట్ల మేజర్‌న్యూస్: ఘర్షణలకు పాల్పడి ఎన్నికల కేసులో ఇరుక్కొని తమ అమూల్యమైన జీవితాలను పాడు చేసుకోవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజలకు సూచించారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలలో, గ్రామాలలో ప్రజలకు చట్టాల పట్ల, వాటిని అతిక్రమిస్తే జరిగే పర్యవసాల గురించి, ఘర్షణలకు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే పోలీస్ శాఖ తీసుకునే చర్యల గురించి పోలీస్ అధికారులు అవగాహన కల్పించి, ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లాలో ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో, గ్రామాలలో ఇప్పటికే పికెట్లు, ఫ్లాగ్ మార్చ్ లు, కార్డెన్ & సెర్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు వివాదాలకు పాల్పడి ప్రజాశాంతికి భంగం కలిగించే వారి పై, వారికి సహకరించే వారిపై పోలీస్ శాఖ తీసుకునే చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కలగజేసేందుకు జిల్లా పోలీస్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలను, గ్రామాలను సందర్శించి ప్రజలతో సమావేశాలు నిర్వహించి వారిలో చైతన్యం నింపుతున్నార న్నారు. కౌంటింగ్ రోజు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని, బాణాసంచా కల్చరాదని, ఇతరులను రేచ్చాగోట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చిన దాని స్వాగతించాలని, రాజకీయ పార్టీలు గెలుపోటములను సమానంగా చూడాలని, కౌంటింగ్ తర్వాత ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలన్నారు. ఎవరైనా ఘర్షణలకు, వివాదాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఓల్టాకు తూట్లు

### యదేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు

### – మామూళ్ళ మత్తుల్లో అధికారులు

### వైకాపా నాయకులు పట్ల కల్పవృక్షంగా ఇసుక దందా

### తూతు మంత్రంగా తనిఖీలో చేతులు దులుపుకుంటున్న అధికారులు





దర్శి, మేజర్‌న్యూస్: ఓల్టా చట్టంను కాపాడాల్సిన అధికారులే ఆ చట్టంను నిర్వీర్యం చేస్తున్నారని అంటున్నారు. జీవ సంపాద అయిన ఇసుక మట్టని కొందరు అక్రమార్కులు తరలిస్తున్న వారు ఇచ్చే కాసులుకు కక్కుర్తి పడి అక్రమ రవాణాకు అధికారులు పచ్చ జండా ఊపుతున్నారని పలువురు అంటుంన్నారు. నియోజకవర్గం పరిధిలోని పలు నది పరివాహక ప్రాంతాల నుండి యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికి తీసుకున్న చర్యలు ఏమి లేవు అని ప్రజలు బహిరంగ గానే అంటున్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన నాటిన నుండి వైకాపా నాయకులు కు కల్ప వృక్షంగా ఇసుకు దందా మారింది. స్థానిక నాయకులు అధికారులను తమ చెప్పు చేతలలో పెట్టుకొని ఇసుక దందా నిర్వహిస్తున్నారు. ముండ్ల మూరు మండలంలోని చిలకలేరు వాగు నుండి తమ్మలూరు సమీపంలో నిత్యం వందలాది వాహనాల్లో ఇసుక తరలిస్తునప్పిటికి అది అధికారులకు కనపడటం లేదని ప్రజలు అంటున్నారు. తమ్మలూరు వద్ద నుండి పదులు సంఖ్యలో ఇసుకను నిత్యం అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. ఇది ఏమాత్రం అధికారులకు



కనపడలేదుని ప్రజలు అంటున్నారు. గత కొంత కాలం నుండి వాగులోనే జె.సి.బి సహాయం ఇసుక తోడి వాహనాలలో నిపుతున్నారని ప్రజలు అంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు మామూళ్లు కు పాల్పడి ఇసుక అక్రమార్కులుకు సహకారం అందిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఎన్నికల కోడ్ సమయంలో ఇసుక అక్రమను అధికారులు ఆపలేక పోతున్నారని ప్రజలు నుండి విమర్శలు అందుకుంటున్నారు. ఇప్పటి ఐన అధికారులు స్పదించి అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేసి ప్రజా ధనాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.